



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

జూపల్లి కంటే నేను తక్కువా?

- ఉపాధ్యాయ దినోత్సవంలో అలిగిన ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి
- స్టేజీ ఎక్కేందుకు నిరాకరణ..
- సమాన స్థాయి హోదాలో ఉన్నా తన ఫొటో చిన్నగా వేస్తున్నారని ఆగ్రహం
- సొంత జిల్లాలో అధికారులు పరువు తీస్తున్నారని మండిపాటు
- గతం నుంచి ప్రొటోకాల్ రగడ..
- కలెక్టర్ జోక్యంతో వేదిక ఎక్కి ప్రసంగం



చిన్నారెడ్డిని వేదికపైకి రావాలని కోరుతున్న డీఈవో గోవిందరాజులు



తన ఫొటో చిన్నగా పెట్టారని చిన్నారెడ్డి చెప్పడంతో ఫ్లెక్సీని చూస్తున్న మంత్రి జూపల్లి, కలెక్టర్ ఆదర్శ్ సురభి

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వనపర్తి జిల్లాలో గురువారం నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డుల అందజేత వేడుక రాజకీయ వివాదానికి కారణమైంది. ఎన్నాళ్లుగానో గూడు కట్టుకున్న ఆవేశం కట్టలు తెంచుకుని, ప్రసంగం రూపంలోకి బయటకు వచ్చింది. దీనంతటికీ చిన్నచిన్న విషయాలే కారణమైనప్పటికీ.. కాంగ్రెస్ పార్టీ పాలిటిక్స్‌కు ఇది ఉదాహరణగా నిలిచిందని చెప్పొచ్చు. వివరాల్లోకెళ్తే.. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వనపర్తి అసెంబ్లీ టికెట్ ఆశించిన విషయం తెలిసిందే. మొదట జాబితాలో ఆయన పేరు ప్రకటించి.. ఆ తర్వాత ఆయన స్థానంలో తూడి మేఘారెడ్డి పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, ఒక పర్యాయం మంత్రిగా పనిచేసిన అనుభవం చిన్నారెడ్డికి ఉంది. పార్టీలో ఆయన సీనియర్ అయినప్పటికీ, ఆయన గెలుపుపై అనుమానం ఉన్న పార్టీ అధిష్ఠానం.. ఆయన స్థానాన్ని కొత్త వ్యక్తికి కేటాయించింది. ఎన్నికల్లో తూడి మేఘారెడ్డి నిరంజన్‌రెడ్డిపై భారీ మెజారిటీతో గెలిచారు. తమ నాయకుడికి టికెట్ ఇవ్వలేదనే కారణంతో ఎన్నికల్లో కూడా చిన్నారెడ్డి వర్గం యాక్టివ్‌గా పనిచేసిన దాఖలాలు పెద్దగా లేవనే అభిప్రాయం ఉంది. ఎవరైనా ముఖ్య నాయకులు వచ్చినప్పుడు మాత్రమే చిన్నారెడ్డి వర్గం హాజరు కనిపించింది. చిన్నారెడ్డి పార్టీకి చేసిన సేవ, సీనియారిటీ, అనుభవం, సీఎం రేవంత్‌రెడ్డి సైతం చిన్నతనంలో ఆయన ఎన్నికల్లో పని చేయడం వంటి అంశాల ప్రాతిపదికన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా బాధ్యతలను కేటాయించారు. ప్రగతి భవన్‌లో నిర్వహించే ప్రజాపాలన కార్యక్రమాన్ని మానిటర్ చేయడంతో పాటు పలు కీలక అంశాల్లో సలహాలు ఇచ్చేందుకు ఆయన సేవలను వినియోగించుకుంటున్నారు. అయితే వనపర్తి నియోజకవర్గానికి వస్తే ఇన్నాళ్లు ఎమ్మెల్యే వర్సెస్ చిన్నారెడ్డిగా సాగిన ప్రొటోకాల్ పంచాయితీ ఈ రోజు మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్న కార్యక్రమం వేదికగా బయటకు వచ్చింది. గత అనుభవాలు, ఇన్నాళ్లుగా గూడు కట్టుకున్న ఆవేశం బయటకు వచ్చిందని పలువురు రాజకీయ నాయకులు చర్చించుకుంటున్నారు.

ఎప్పుడూ ఇంతే..

ప్రభుత్వ కార్యక్రమాలు ప్రతీసారి ఆలస్యంగా మొదలవుతున్నాయని ఆరోపణలు గతంలో నుంచి ఉన్నాయి. ముఖ్య అతిథులు సమయపాలన పాటించకపోవడంతో చాలామంది సమయానికి వచ్చిన వారు ఇబ్బందులు పడుతున్నారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలకు ప్రణాళికలు చేయడం లేదు. తాజా ఘటనలో కూడా కార్యక్రమం దాదాపు రెండున్నర గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. అవార్డుల కోసం వచ్చిన ఉపాధ్యాయులతోపాటు వివిధ శాఖల ఉద్యోగులు కూడా ఇలా ఆలస్యంగా కార్యక్రమాలు జరపడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనూ ఇలాంటి ఘటనలు చాలానే జరిగాయి. గతంలో ఒక కార్యక్రమంలో విద్యార్థులను వివిధ స్కూళ్ల నుంచి కార్యక్రమానికి తీసుకురాగా.. ఎండ తీవ్రతతో కొందరు సొమ్మసిల్లిన ఘటనలు కూడా ఉన్నాయి. ప్రధానంగా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరు కావాల్సిన వారు ఆలస్యంగా వస్తుండటంతో అటు అధికారులు.. ఇటు మిగతా ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు.

తాజా వివాదం ఏంటంటే..

జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వచ్చిన వారికి వాటి పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని లక్ష్మీకృష్ణ గార్డెన్‌లో నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. ఆ మేరకు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి కూడా ఆహ్వానం పంపారు. అధికారులు చెప్పిన ప్రకారం చిన్నారెడ్డి పది గంటలకు వేదిక వద్దకు తన అనుచరులతో చేరుకున్నారు. కానీ అప్పటివరకు అక్కడ కార్యక్రమం మొదలు కాలేదు. ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పిన జూపల్లి కృష్ణారావు కూడా చేరుకోలేదు. ఈ క్రమంలో చిన్నారెడ్డి అనుచరులతో వేదిక దిగువన కూర్చున్నారు. రెండు గంటలు దాటిన తర్వాత కూడా కార్యక్రమం ప్రారంభం కాకపోవడంతో డీఈవో గోవిందరాజులు చిన్నారెడ్డిని వేదికపైకి రావాలని ఆహ్వానించారు. సమయపాలన పాటించలేదని చిన్నారెడ్డి వేదికపైకి వెళ్లేందుకు ససేమిరా అన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి కలెక్టర్ ఆదర్శ్ సురభి వేదిక వద్దకు చేరుకుని, చిన్నారెడ్డిని వేదిక మీదకు రావాలని ఆహ్వానించడంతో ఆయన ఆసీనులయ్యారు. అనంతరం కొద్దిసేపటికి మంత్రి జూపల్లి కృష్ణారావు వచ్చారు. చిన్నారెడ్డికి మాట్లాడేందుకు అవకాశం ఇవ్వగా.. ఆయన మెదట విద్యాశాఖ తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. డీఎస్సీ ద్వారా క్వాలిఫై అయ్యి.. ఎన్నో పరీక్షలు ఉత్తీర్ణులైన ఉపాధ్యాయులు పాఠాలు చెప్పిన ప్రభుత్వ పాఠశాలల్లో సరైన ఫలితాలు రావడం లేదని, డీఎస్సీ ఫెయిల్ అయిన వారు చెబుతున్న ప్రైవేటు పాఠశాలల్లో ఫలితాలు ఎలా ఎక్కువగా వస్తున్నాయని ప్రశ్నించారు. ఆ తర్వాత తాను జూపల్లి కంటే తక్కువ కాదని, ఎన్నో సమావేశాల్లో సమాన స్థాయి హోదాలో ఉన్నా.. తన ఫొటోను చిన్నగా వేస్తున్నారని మండిపడ్డారు. ఈ జిల్లా అభివృద్ధికి ఎన్నో ఏళ్ల నుంచి తాను కృషి చేస్తున్నానని, కానీ సొంత జిల్లాలో తన పరువును అధికారులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేబినెట్ హోదాలో ఉన్న తన ఫొటోను చిన్నగా వేయడం తనను అవమానించడమేనని, దాని వెనుక రహస్యం ఏంటని అడిగారు. పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

సమాజ పరివర్తనలో విద్య అగ్ర భాగంలో ఉండాలి

- ఆబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రూరల్, సెప్టెంబరు 5: సమాజ పరివర్తనలో విద్య అగ్రభాగాన ఉంటుందని అలాంటి విద్యను బోధించే ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేసి సమ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా సెప్టెంబరు 5వ తేదీని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకొంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జీ చిన్నారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన హాజరై ఉపాధ్యాయులకు టీచర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని తెలిపారు. మనిషి తనకు తాను సంస్కరించుకొని సమాజ పురోగాభివృద్ధికి పాటుపడే విధంగా ఉత్తమ వ్యక్తులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు 60 లక్షల మంది పిల్లలు పాఠశాలల్లో చదువుకుంటున్నారని, అందులో కేవలం 22 లక్షల మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని, మిగిలిన వారంతా ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. తనకు వచ్చే రూ.10 కోట్ల బడ్జెట్‌తో పాటు సీఎస్ఆర్ ఫండ్ సైతం విద్య, వైద్యానికే ఖర్చు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ సర్వేపల్లి రాధాకృష్ణ పుట్టింది తమిళనాడులోని తిరుత్తనూరులో అయిన ఆయన మన తెలుగువాడు అని గర్వంగా చెప్పుకొచ్చారు. ఒక నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సర్వేపల్లి కష్టపడి చదివి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఉపరాష్ట్రపతిగాను, రెండో రాష్ట్రపతిగాను పని చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని తమ వృత్తికి న్యాయం చేస్తు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. వనపర్తి జిల్లాను విద్యలో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ... ప్రభుత్వ విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద దాదాపు 500 పాఠశాలలకు రూ.13.50 కోట్ల నిధులతో మౌలిక వసతులు కల్పించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని విద్యార్థులు పాఠాలు బట్టీ పట్టే విధంగా కాకుండా అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. అనంతరం జిల్లానుంచి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మందిని మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, కలెక్టర్ శాలువాలు, మెమోంటోలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, డీఈవో గోవింద రాజులు, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మునిసిపల్ చైర్మన్ మహేష్, భాస్కర్ గుప్త, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని కుమారుడి ఆత్మహత్య

కల్వకుర్తి టౌన్, సెప్టెంబరు 5 : తండ్రి మందలించాడని కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి పట్టణంలోని కళ్యాణ్‌నగర్ కాలనీలో గురువారం చోటుచేసుకున్నది. ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ గౌడు హైదరాబాద్‌లో నివాసం ఉండేవారు. ఇటీవల స్వగ్రామమైన కళ్యాణ్‌నగర్‌లో గృహప్రవేశం చేశారు. గురువారం ఉదయం ఇంటి ఆవరణలో ఉన్న సంపును కడిగేందుకు శ్రీనివాస్‌గౌడు, అతడి పెద్ద కుమారుడు వెళుతుండగా తాను వస్తానని అనడంతో శ్రీనివాస్‌గౌడు చిన్నకుమారుడు యశ్వంత్ (12)ను మందలించారు. దీంతో ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని చీరతో ఉరివేసుకున్నాడు. యశ్వంత్ బయటకు రాకపోవడంతో తన అన్న కిచెన్ కిటికీలో నుంచి గమనించి తండ్రికి చెప్పగా వెంటనే అతడిని కిందకుదించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పట్టుబడిన నల్ల బెల్లం, పటిక, నాటుసారాలను చూపుతున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి

భారీగా నల్లబెల్లం పట్టివేత

- 21 టన్నుల నల్ల బెల్లం, 60 కిలోల పటిక, 50 లీటర్ల గుడుంబా స్వాధీనం
- వాటి విలువ రూ.21.36 లక్షలు
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి వెల్లడి

జడ్చర్ల, సెప్టెంబరు 5: జడ్చర్ల ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం భారీగా నల్లబెల్లం పట్టుకున్నారు. 21 టన్నుల 30 కిలోల నల్లబెల్లం, 60 కిలోల పటిక, 50 లీటర్ల నాటుసారా(గుడుంబా)ను పట్టుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలను జడ్చర్ల ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జడ్చర్ల కొత్త బస్టాండు సమీపంలో బుధవారం రాత్రి రూట్‌వాచ్ చేస్తుండగా అనుమానం వచ్చి పోలీసులు ఒక వాహనాన్ని ఆపి, తనిఖీలు చేశారని తెలిపారు. ఆ వాహనంలో 30 కిలోల బరువుతో ఉన్న 60 బ్యాగుల నల్లబెల్లం, 20 కిలోల పటిక, 10 లీటర్ల నాటుసారాను పట్టుకున్నారని చెప్పారు. బెల్లంపై ఆరా తీయగా నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండలంలోని దేవదారుకుంటకు తరలిస్తున్నట్లు సింగరేణి కాలనీకి చెందిన కాట్రావత్ శ్రీను వెల్లడించాడన్నారు. శ్రీనును అదుపులోకి తీసుకుని మరింత విచారణ చేపట్టగా హైదరాబాద్‌లోని ఆరాంఘర్ సమీపంలోని శివరాంపల్లి క్రాస్ రోడ్డు వద్ద కర్ణాటక రాష్ట్రానికి చెందిన లారీలో 30 కిలోల తూకంతో ఉన్న 650 బస్తాల నల్లబెల్లం, 40 కిలోల పటిక, 40 లీటర్ల నాటుసారా ఉన్నట్లు గుర్తించి, సరుకును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. లారీలో ఉన్న కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ఎండీ రఫీని అదుపులోకి తీసుకుని విచారణ చేశామన్నారు. లారీలో ఉన్న సరుకును నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, జనగామా జిల్లాలకు సరఫరా చేసేందుకు సిద్ధం చేసినట్లు వివరించాడని చెప్పారు. ఈ ఘటనలో జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలో కాట్రావత్ శ్రీనును, శివరాంపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఎండీ రఫీని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రెండు ప్రాంతాలలో రూ.21 లక్షల 30 వేల విలువగల 21 టన్నుల 300 కిలోల నల్లబెల్లం, రూ.ఆరు వేల విలువ గల 60 కిలోల పటిక, 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన సరుకుతో పాటు వాహనాల విలువ రూ.68 లక్షల 50 వేలు ఉంటుందని చెప్పారు. నల్లబెల్లాన్ని పట్టుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ శ్రీనివాసులు, సీఐలు బాలకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శారద, విప్లవ్‌రెడ్డి, ఎస్‌ఐలు సృజన్‌రావు, నాగరాజులను అభినందించారు.

ఎంపీ నిధులు రూ.31.92 లక్షలు వెనక్కి

- ఇ-సాక్షి పోర్టల్‌ను తెచ్చిన కేంద్ర ప్రభుత్వం
- వేగవంతం, అవినీతి రహితం కోసమే..

గద్వాల, సెప్టెంబరు 5: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఇ-సాక్షి పోర్టల్ వల్ల ఖర్చు కాకుండా మిగిలిపోయిన ఎంపీ నిధులు వెనక్కి వెళ్లాయి. జోగుళాంబ గద్వాల జిల్లాకు ఎనిమిది మంది ఎంపీలు వివిధ అభివృద్ధి పనుల కోసం నిధులను కేటాయించారు. అందులో చాలా వరకు ఖర్చు అయ్యాయి. మార్చి 31వ తేదీ వరకు ఖర్చు కాకుండా మిగిలిన రూ.31.92 లక్షలను కేంద్రం వెనక్కి తీసుకుంది.

ఎవరెవరివి ఎంతంటే..

కేంద్ర ప్రభుత్వం ఎంపీలకు వారి ప్రాంత అభివృద్ధికి 1993 నుంచి ఏటా రూ.ఐదు కోట్ల నిధులను కేటాయిస్తోంది. అయితే ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కేంద్రం ఇ-సాక్షి పోర్టల్‌ను తెచ్చింది. ఎంపీలు నిధుల విడుదల నుంచి ఖర్చు వరకు ఈ పోర్టల్ ద్వారానే నిర్వహించాల్సి ఉంటుంది. అందులో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాకు ఎంపీలు ప్రతిపాదించిన నిధుల్లో మార్చి 31వ తేదీ వరకు ఖర్చు చేయని వాటిని వెనక్కి తీసుకుంది. అందులో టీజీ వెంకటేష్ అలంపూర్ ప్రాంత అభివృద్ధికి కేటాయించిన వాటిలో రూ.19.78 లక్షలు, గరికపాటి మోహన్‌రావు రూ.8.76 లక్షలు, కేవీపీ రాంచందర్‌రావు రూ.2.50లక్షలు, కేశవ అచ్చితిన్, రాములు, బండి సంజయ్, కనకమేడల రవీందర్‌రెడ్డి, కేఆర్ సురేష్ ఇచ్చిన నిధుల్లో కూడా ఖర్చుకాకుండా ఉన్న వాటిని వెనక్కి తీసుకున్నారు.

పోర్టల్ ప్రారంభంలోపు ఖర్చు కాలేదు

ఇ-సాక్షి పోర్టల్ ఏప్రిల్ నుంచి ప్రారంభం అయ్యింది. ఆలోపు ఎంపీలు ఇచ్చిన నిధులు ఖర్చు చేయాల్సి ఉండే.. కానీ పనులు పూర్తి కాకపోవడంతో ఖర్చు కాలేదు. దీంతో ఖర్చు కాకుండా ఉన్న నిధులను మార్చి 31న వెనక్కి తీసుకున్నారు. ఇ-సాక్షి పోర్టల్ వల్ల అనుమతుల నుంచి పనుల పూర్తి వరకు చకచక జరిగిపోతాయి. బిల్లులు కూడా ఢిల్లీ నుంచి వెంటనే విడుదల అవుతాయి.

- లక్ష్మణ్ సీపీవో, జోగుళాంబ గద్వాల జిల్లా

సీఎం సొంతూరుకు కీలక ప్రాజెక్టు

- రైతులకు అందించనున్న సోలార్ పంపుసెట్లు
- పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన కొండారెడ్డిపల్లి
- తీరనున్న విద్యుత్ సమస్యలు
- పథకం అమలుపై రాష్ట్ర విద్యుత్ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష



సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లి

వంగూరు/ వెల్దండ, సెప్టెంబరు 5: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి మరో కీలక ప్రాజెక్టు రానుంది. వ్యవసాయంలో విద్యుత్ ఒడిదుడుకులను అధిగమించేందుకు ప్రభుత్వం రైతులకు సోలార్ పంపుసెట్లను అందజేయనుంది. కేంద్ర ప్రభుత్వ పీఎం కుసుమ్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని, సోలార్ పంపుసెట్ల పథకాన్ని ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో విద్యుత్ రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో సీఎం బుధవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో సౌర విద్యుత్ పెరిగేలా చర్యలు చేపట్టాలని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం అధికారులకు సూచించారు. రైతులు తమ భూముల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని చెప్పారు. పంపుసెట్లకు వాడుకున్న అనంతరం మిగులు విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేసి, రైతులకు అదనపు ఆదాయ వనరులు సమకూరేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

గ్రామస్థుల హర్షం

సోలార్ పంపుసెట్ల పథకానికి ఎంపిక చేయడం పట్ల కొండారెడ్డిపల్లి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎటువంటి సాగునీటి వనరులు లేని ఈ ప్రాంతంలో రైతులు ప్రధానంగా విద్యుత్ మోటర్లపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. విద్యుత్ సరఫరాలో సమస్యల వల్ల మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుండటంతో పంటల సాగులో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో సోలార్ పంపుసెట్ల ఏర్పాటుతో రైతులకు మేలు చేకూరనుంది. గ్రామంలో 1,283 వ్యవసాయ మోటార్లు, 564 గృహ, కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. సోలార్ వల్ల వ్యవసాయంతో పాటు గృహాలు, ఇతర కమర్షియల్ వ్యాపారాలకు మెరుగైన విద్యుత్‌తో అదనపు లాభం చేకూరనుంది.

సోలార్ విద్యుత్‌తో లాభం



సోలార్ పంపుసెట్ల పథకానికి కొండారెడ్డిపల్లి పైలెట్ ప్రాజెక్టు ఎంపిక చేయడం ఆనందంగా ఉంది. ఈ పథకం వల్ల వ్యవసాయానికి మెరుగైన విద్యుత్ సరఫరా కానుంది. దీంతో సాగు విస్తీర్ణం పెరుగనుంది.

- కడారి యాదయ్య, రైతు, కొండారెడ్డిపల్లి

రోడ్డుపై పాలు పారబోసి నిరసన

- బిల్లులు వెంటనే చెల్లించాలని రైతుల డిమాండ్

కల్వకుర్తి, సెప్టెంబరు 5: పెండింగ్ పాల బిల్లులను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం మార్చాల జాతీయ రహదారిపై పాడి రైతులు గురువారం పాలు పారబోసి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విజయ డెయిరీ నుంచి రెండు నెలలుగా బిల్లులు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాలయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పురం రాంరెడ్డి, మోహన్‌రావు, సంతోష్, మల్లేష్, లింగమయ్య, నిజాం, తిరుపతయ్య, కిశోర్, మల్లేష్, బాలరాజు, రమేష్, కృష్ణ, శేషిరెడ్డి, జంగారెడ్డి, కిశోర్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం, రాముడు, రైతులు పాల్గొన్నారు.



పాలు పారబోసి, నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

భర్తను చంపిన భార్య



నాగరాజు(ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 5: మద్యం తాగి తరచూ వేధిస్తుండటంతో మనస్తాపానికి గురైన వివాహిత.. భర్తను హత్య చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉయ్యాలవాడకు చెందిన కాకునూరి నాగరాజు(35) రోజూ మద్యం తాగి భార్య సూర్యను వేధించేవాడు. విసుగు చెందిన ఆమె బుధవారం రాత్రి నాగరాజు పడుకున్న సమయంలో తువాలతో గొంతు నొక్కిపట్టి, హత్య చేసింది. గురువారం ఉదయం ఇంటి పక్కల ఉండే వరుసకు చిన్నమ్మ అయ్యే సాయమ్మ వద్దకు వెళ్లి తన భర్త లేవడం లేదని చెప్పింది. సాయమ్మ, ఆమె కొడుకు మహేష్ వెళ్లి చూసి, మృతి చెందినట్లు గుర్తించారు. కోటాలగడ్డలో ఉండే నాగరాజు చెల్లెలు రేణుక వచ్చి చూసి, తన అన్నను వదినే చంపిందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. సూర్యను సఖి సెంటర్‌కు తరలించారు. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

దేవరకద్ర ఎమ్మెల్యే జీఎంఆర్‌కు పితృవియోగం

» కృష్ణారెడ్డికి నివాళులర్పించిన నాయకులు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 5 : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఎమ్మెల్యే తండ్రి కృష్ణారెడ్డి గురువారం ఉదయం కన్ను మూశారు. విషయం తెలిసిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృష్ణారెడ్డి స్వగ్రామం దమాగ్నాపూర్‌కు తరలివచ్చారు. ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మక్తల్, జడ్చర్ల, గద్వాల ఎమ్మెల్యేలు వాకిటి శ్రీహరి, జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, సరితా తిరుపతిరెడ్డి, మిథున్‌రెడ్డిలతో పాటు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పరామర్శించారు. సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి.



ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి (అంతర చిత్రంలో) కృష్ణారెడ్డి(ఫైల్)

మహిళా భద్రతకు అభయమివ్వని

హస్తానికి అధికారమెందుకు

» రోజుకో రేప్, గంటకో అఘాయిత్యం.. ఇదేనా మార్పు » బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి

» తక్షణమే నిందితుడిని అరెస్టు చేయాలి » తెలంగాణ చౌరస్తాలో బీజేపీ మహిళా మోర్చా నిరసన

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), సెప్టెంబరు 5 : తెలంగాణాలో మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికారమెందుకని.. రోజుకో రేప్, గంటకో అఘాయిత్యం ఇదేనా మార్పు అని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన ఆదివాసి ఆడబిడ్డపై ఆగస్టు 31న జరిగినటువంటి అత్యాచారం, ఆపై హత్యాయత్నాన్ని నిరసిస్తూ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి పిలుపుమేరకు గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా భద్రతకు అభయమివ్వని హస్తానికి అధికార మెందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. మహిళపై జరిగింది హత్యాచారమే అని కుటుంబ సభ్యులు మీడియా సాక్షిగా చెప్పినా ప్రభుత్వం పక్కదోవ పట్టించే ప్రయత్నం చేయడం దుర్మార్గమైన చర్య అని విమర్శించారు. తక్షణమే నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ, అత్యాచారం, హత్యాయత్నం కేసులు నమోదు చేసి ఉరిశిక్ష విధించి, బాధిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయశ్రీ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాదయ్య, గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్, మహిళామోర్చా నాయకురాలు బాలకృష్ణమ్మ, వెంకటేశ్వరమ్మ, లక్ష్మి, వివిధ మండలాల మహిళా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

గవర్నర్‌ను కలిసిన ఫుడ్ కమిషన్ చైర్మన్



గవర్నర్‌ను సన్మానిస్తున్న ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 5 : హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌ను ఆయన పూలమాల, శాలు వాతో సత్కరించారు. ఫుడ్ కమిషనర్ వార్షిక నివేదికను గవర్నర్‌కు సమర్పించి నట్లు ఆయన పేర్కొన్నారు. గవర్నర్‌ను కలిసిన వారిలో కమిషన్ సభ్యులు ఉన్నారు.

ఉన్నత విద్యలో బంగారు పతకం

» బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన చిన్నచింతకుంట విద్యార్థి



సోహెబ్

చిన్నచింతకుంట, సెప్టెంబరు 5 : కృషి ఉంటే మనుషులు రుషులవుతారు అని నిరూపించాడు ఆ విద్యార్థి. పేద కుటుం బంలోనే పుట్టినా అనుకున్నది సాధించాలన్న తపన, కసి, పట్టుదల ఉన్న ఆ విద్యార్థికి ఉన్నత విద్యలో బం గారు పతకాన్ని దక్కేలా చేసింది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన మహమూద్, నజీమాబేగంలకు చెందిన కుమారుడు సోహెబ్ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో గోల్డ్‌మెడల్ సాధించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా ఎస్ఆర్ ఎం యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ ఇన్ ఫిజిక్స్ (హానర్స్ విత్ రీసెర్చ్) లో ఫస్ట్ ర్యాంకు సాధించి బంగారు పతకాన్ని సాధించాడు. సోహెబ్ యూని వర్సిటీ ప్రొఫెసర్ల చేతులమీదుగా ప్రశంసాపత్రం, బంగారు పతకాన్ని అందు కున్నట్లు కుటుంబీకులు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

సంగంబండ కుడికాల్వకు ఒడ్డు వేయాలి

కృష్ణ, సెప్టెంబరు 5 : సంగంబండ కుడికాల్వకు ఒడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కృష్ణ మండలం ఆలంపల్లి గ్రామానికి చెందిన చరణ్‌బాబు పురుగు మందు డబ్బాతో రెవెన్యూ కార్యాలయానికి వెళ్లి నిరసన చేపట్టాడు. వారంరోజుల నుంచి కురుస్తున్న వర్షానికి కాల్వ తెగి పత్తి పొలంలోకి నీరు చేరిందని ఆవేదన వ్యక్తం చేశాడు. మునిగిన పంటను ఎమ్మెల్యే సైతం పరిశీలించారన్నారు. అప్పులు చేసి పంట వేశానని కానీ వర్షం కారణంగా కాల్వ తెగి తన పంట నీట మునిగిందని వాపోయాడు. కాల్వ మరమ్మతులు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మాగనూరు, సెప్టెంబరు 5 : చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. నారాయణపేట జిల్లా మాగనూరు మండలం వడ్వాట్ గ్రామా నికి చెందిన గుంటగారి వెంకటేష్ బుధవారం వడ్వాట్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా పరిస్థితి విష మించి, గురువారం మృతి చెందినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలి పారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నాడు. ప్రభుత్వం మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ట్రాలీ బోల్తా.. తప్పిన ప్రమాదం

మాగనూరు, సెప్టెంబరు 5 : నారాయణపేట జిల్లా మాగనూరు మండలం నేరడుగం గ్రామ శివారులోని సంగంబండ బైరోడ్‌లో సెంట్రింగ్ డబ్బాల లోడుతో వస్తున్న ట్రాక్టర్ గురువారం సాయంత్రం బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శంకర్‌రెడ్డికి ప్రమాదం తప్పింది. ఉజ్జెల్లి గ్రామం వైపు నుంచి మక్తల్‌కు వెళ్తున్న ట్రాక్టర్ లెవల్ కెనాల్ రోడ్డు బ్రిడ్జిపై పడ్డ గుంతలో టైరు ఇరుక్కుపోవడంతో వాహనం బోల్తా పడింది. అధికారులు బ్రిడ్జిపై ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

దొంగతనం కేసులో ఇద్దరికి జైలు శిక్ష

పెబ్బేరు... వీపనగండ్ల, సెప్టెంబరు 5 : గొలుసు దొంగతనం కేసులో ఇద్దరికి జైలుశిక్ష పడినట్లు ఎస్పీ రావుల గిరిధర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2020 నవంబరు 11న వనపర్తి జిల్లా వీపనగండ్ల మండలం తూంకుంట గ్రామానికి చెందిన బత్తుల ఎల్లమ్మ పొలం నుంచి ఇంటికి వస్తుండగా ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి మెడలో ఉన్న రూ.60 వేల విలువ గల బంగారు పుస్తెలతాడును లాక్కుని వెళ్లారు. అప్పటి ఎస్సై వహీద్ అలీబేగ్ కేసు నమోదు చేశారు. జనవరి 6, 2021న కోడేరు మండలం తీగలపల్లి సమీపంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు తప్పించుకొని పారిపోతుండగా పట్టుకుని విచారించారు. తూంకుంటలో ఒక మహిళ మెడలో గొలుసు చోరీ చేసినట్లు కల్వకోలు గ్రామానికి చెందిన గోపాలకృష్ణ, మొగిలి వెంకటయ్యలు ఒప్పుకున్నారు. ఈ కేసుపై వనపర్తి కోర్టులో విచారణ చేపట్టారు. గురువారం నిందితులను వనపర్తి మొదటి అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో ఎనిమిది నెలల జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.200 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బండారి శ్రీలత తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

గొర్రెల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

» రిమాండ్‌కు తరలింపు

కృష్ణ, సెప్టెంబరు 5 : దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతని నుంచి టవేరా వాహనం, స్కూటీని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మక్తల్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరి జిల్లా బద్దెపల్లి తండాకు చెందిన తుకారంరాథోడ్ గొర్రెలు దొంగతనం చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. నిందితుడి నుంచి వాహనాలతో పాటు, రూ.లక్షా 60 వేలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఇతను హిందూపూర్, కుస్తి జాతీయ రహదారులపై గొర్రెలు దొంగతనం చేస్తున్నట్లు తెలిపారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

ఎర్రవల్లి, సెప్టెంబరు 5 : జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని బీచుపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం రాత్రి గుర్తు తెలియని మహిళను వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన మహిళ వయసు 35ఏళ్ల నుంచి 40లోపు ఉంటుందని, ఆమె గోధుమ రంగు బ్లౌజ్, పూల డిజైన్ కలిగిన చీరను ధరించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతదేహన్ని గద్వాల ఆస్పత్రిలో ఉంచామని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెరువులో దూకి మహిళ బలవన్మరణం

శ్రీరంగాపురం, సెప్టెంబరు 5 : చెరువులో దూకి మహిళ బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని జానంపేటలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన మనెమ్మ (56), భర్త నాగన్నకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కూతురు భర్తతో విభేదాలతో రెండు నెలల క్రితం పుట్టింటికి చేరింది. కాగా కూతురికి ఓ గది నిర్మించి ఇవ్వాలని మనెమ్మ భర్తకు తెలిపింది. దీనికి కుమారులు వద్దని వారిస్తూ వచ్చారు. మనస్థాపం చెందిన మనెమ్మ గురువారం గ్రామంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. తమ్ముడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

గద్వాలలో చోరీలు షరా మామూలే

- ఇంట్లో నిద్రిస్తుండగానే.. పక్క గదిలో చోరీ



చెల్లాచెదురుగా పడిన వస్తువులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 5 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో కొంతకాలం నుంచి చోరీలు షరా మామూలు అయిపోయాయి. గతంలో తాళం వేసిన ఇళ్లలో రాత్రిపూట చోరీలకు పాల్పడగా, ఇప్పుడు పగటిపూట యథేచ్ఛగా చోరీ చేసి పారిపోతున్నారు. గురువారం ఏకంగా ఇంట్లో మనుషులు ఉండగానే పక్క గదిలో చోరీ చేసిన ఘటన జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో తెల్లవారుజామున చోటు చేసుకొంది. ఇంటి యజమాని ఫైజాద్ తెలిపిన వివరాలిలా.. రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటుండగా, తండ్రికి ఆరోగ్య సమస్యలు ఉండటంతో బుధవారం ఆసుపత్రిలో చూపించి తండ్రివద్దే పక్కగదిలో ఉండిపోయారు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి ప్రవేశించి రూ.35వేల నగదు, మూడు బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు బాధిత కుటుంబసభ్యులు తెలిపారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

పాన్‌షాపులో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 5 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలోని పాన్‌షాపులో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నిర్వాహకుడు మహమ్మద్ జాఫర్ పాన్‌షాపు బంద్ చేసి ఇంటికొచ్చాడు. గురువారం ఉదయం వెళ్లేసరికి తాళాలు విరగ్గొట్టి ఉంది. కొంత నగదు, సిగరెట్లు, అందులో ఉన్న సరుకులను ఎత్తుకెళ్లారు. ఘటనపై ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీమ్ సిబ్బంది ఆధారాలు సేకరించారు.



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీమ్ సిబ్బంది

పీహెచ్‌సీని పరిశీలించిన కేంద్ర బృందం



కేంద్ర బృందంతో వైద్యులు, సిబ్బంది

మిడ్జిల్, సెప్టెంబరు 5: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కేంద్ర ఆడిట్ బృందం సతీష్‌కుమార్, శివకుమార్, రవికుమార్ గురువారం పరిశీలించారు. ఐదేళలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. డాక్టర్లు శివకాంత్, కృష్ణకుమార్, జిల్లా అడ్మినిస్ట్రేషన్ అధికారి రమేష్ అనిల్, పుష్ప, వైద్యులు ఉన్నారు.

బస్సులు నడపాలని విద్యార్థుల రాస్తారోకో



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 5 : మండలంలోని తాండూరు, కొరటికల్ ఇతర గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు గురువారం పట్టణంలోని బస్టాండ్ రోడ్డుపై ధర్నా చేపట్టారు. సాయంత్రం గంటల తరబడి వేచి ఉన్నా గ్రామాలకు బస్సులు రావడం లేదని విద్యార్థులు వాపోయారు. కొన్ని రోజులుగా ఇదే జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ స్పందించి బస్సులు నడపాలని విద్యార్థులు పోలీసులతో వాపోయారు. అక్కడకు చేరుకున్న పోలీసులు డిపో మేనేజర్ ప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడి గ్రామాలకు బస్సును పంపించారు. గ్రామాలకు బస్సులు నడుపుతామని డిపో మేనేజర్ హామీ ఇచ్చారు.

కొనసాగుతున్న జల విద్యుదుత్పత్తి



ఉత్పత్తి అనంతరం దిగువకు వెళ్తున్న నీరు

ఆత్మకూరు, సెప్టెంబరు 5 : ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాలలో ఉత్పత్తి కొనసాగుతుందని ఇన్‌చార్జి ఎస్ఈ సూరిబాబు గురువారం తెలిపారు. స్వల్పంగా వరద వస్తున్న కారణంగా 11 యూనిట్లు ప్రారంభించి ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. 24 గంటల్లో ఐదు యూనిట్ల ద్వారా 3.342 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి కాగా, దిగువ కేంద్రం ద్వారా 3.808 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగినట్లు పేర్కొన్నారు. వరద ఇలాగే కొనసాగితే రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని ఎస్ఈ పేర్కొన్నారు.

ఉమామహేశ్వరానికి కోతుల బెడద

» ఇబ్బందులు పడుతున్న భక్తులు

అచ్చంపేట, సెప్టెంబరు 5 : నాగర్‌కర్నూల్ జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఉమామహేశ్వర క్షేత్రంలో రోజురోజుకు కోతుల బెడద అధికమవుతుందని భక్తులు చెబుతున్నారు. భక్తుల చేతుల్లోని ప్రసాదం, తిండి పదార్థాలు లాక్కుని వెళ్తున్నాయి. వాహనాలపై పడి సీట్లు చించివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆలయానికి వచ్చామన్న ప్రశాంతత కూడా లేదని భక్తులు వాపోతున్నారు. గతంలో ఒకటో, రెండో కోతులు మాత్రమే కనిపించేవని, కొన్నేళ్లుగా క్షేత్రానికి వచ్చే భక్తులు పండ్లు ఇవ్వడంతో వాటికి ఆహార కేంద్రంగా మారినట్లు సిబ్బంది చెబుతున్నారు. ప్రధాన సమస్యగా మారిన కోతుల బెడదను ఆలయ అధికారులు తప్పించాలని భక్తులు కోరుతున్నారు.



భక్తుల వద్ద ప్రసాదం లాక్కొని తింటున్న కోతులు



ఆలయ ప్రాంగణంలో గుంపులుగా ఉన్న కోతులు

ఇబ్బంది పెడుతున్నాయి..



ఎంతో దూరం నుంచి ఉమామహేశ్వరున్ని దర్శించుకుందామని వస్తే ఇక్కడ మాత్రం కోతులు మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నాయి. ఆలయానికి వచ్చిన ప్రశాంతత లేదు. ఆలయం వద్ద కోతులను నివారించాలి.

- మహేష్, భక్తుడు, గట్టుతుమ్మెన్

భక్తులు జాగ్రత్తలు పాటించాలి



ఉమామహేశ్వర క్షేత్రం అడవిలో ఉంది. గతం కంటే కోతులు అధికమయ్యాయి. అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాం. గతంలో కోతులు పట్టుకపోయి దూరంగా వదిలేశారు. అవి మళ్లీ తిరిగి వస్తున్నాయి. భక్తులు జాగ్రత్తలు పాటించాలి.

-శ్రీనివాస్‌రావు, ఈఓ

మద్దిమడుగుకు ఘనమైన చరిత్ర

» అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

» ఘనంగా కొత్త పాలక మండలి ప్రమాణ స్వీకారం

అమ్రాబాద్ సెప్టెంబరు 5 : నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామికి ఘనమైన చరిత్ర ఉందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. గురువారం ఆలయ పాలక మండలి చైర్మన్‌గా దేశవత్ రాములు నాయక్, 12 మంది పాలక మండలి సభ్యులకు ఆలయ ఆవరణలో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. నల్లమల ప్రాంతంలో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధి కోసం కొత్తగా ఏర్పాటయిన పాలక మండలి ఆధ్వర్యంలో తక్షణమే నిర్ణయాల తీసుకుని ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావివ్వరాదని సూచించారు. మద్దిమడుగు ఆలయాన్ని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతంలో పలు చోట్లకు పర్యాటకులను తీసుకెళ్లేందుకు ప్రత్యేక మినీ బస్సులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఈ ప్రాంతం టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

కృష్ణానదిపై వంతెన నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడులను త్వరలోనే కలిసి కోరుతామన్నారు. అప్పర్ ప్లాట్ ప్రాంతానికి సాగునీరు అందించడంతో పాటు ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను శక్తి వంచన లేకుండా అమలు చేయనున్నట్లు వివరించారు. మద్దిమడుగు పేరును త్వరలో మద్దిపట్నంగా, ఈగలపెంట, దోమలపెంటలను విష్ణుగిరి, బ్రహ్మగిరిలుగా పేరు మార్పు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పాలక మండలి చైర్మన్, సభ్యులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఈవో రంగాచారి, అచ్చంపేట మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు, గణేష్, హరినారాయణగౌడ్, మల్లికార్జున్, లింగం, బాల్ లింగంగౌడ్, నరహరి తదితరులున్నారు

రాష్ట్ర అవార్డులు అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పలుస శంకర్‌గౌడ్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా/మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 5 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నారు. వనపర్తి జిల్లా నుంచి యావర్ల హైస్కూల్ గెజిటెడ్ హెచ్‌ఎం పలుస శంకర్‌గౌడ్, దేవరకద్ర మండలం పెద్దరాజమూర్ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ ఉపాధ్యాయురాలు డి.కవితతో పాటు, కోయిల్‌కొండ మండలం ఇబ్రహీంనగర్ ప్రాథమిక పాఠశాల ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం నర్సింహులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. వీరిని గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సన్మానించారు.



అవార్డు అందుకుంటున్న కవిత

మహమ్మద్ ప్రవక్త సద్గుణ మార్గాలను ఆచరించాలి

అమరచింత, సెప్టెంబరు 5 : మహమ్మద్ ప్రవక్త ఆచరించిన సద్గుణ మార్గాలను ఆచరించాలని హైదరాబాద్ జామియా నిజామియా ఉర్దూ యూనివర్సిటీ మౌలానా సమీర్ ఉర్ రెహ్మాన్ తెలిపారు. మిలాద్ ఉన్ నబి వేడుకల్లో భాగంగా గురువారం రాత్రి అమరచింత జామియా మసీదులో ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక సదస్సు, విద్యార్థుల ఉర్దూ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఐదు పూటల నమాజు, దానధర్మాలు చేస్తూ సోదరభావంతో మెలగాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్నతనం నుంచే చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతనను అలవరిస్తే వారు చెడు మార్గంలో వెళ్లరని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉర్దూ గజల్, నాతే షరీఫ్ పాడి ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వాహకులు మెడల్, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మౌలానా అల్తాఫ్ బేగ్, నవాజ్, ఆఫీస్ ఫరీద్, ఖాజా హుస్సేన్, రఫీ, ఖాసీం, రహమాన్, ఫరీద్, తాజు, సర్దార్, అలీ, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక సదస్సులో మాట్లాడుతున్న మౌలానా సమీర్ ఉర్ రెహ్మాన్

సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ముందుండాలి

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 5: సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జేడీ విజయ్‌కుమార్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో పర్యటించిన ఆయన పట్టణంలోని రాంనగర్ కాలనీలో సీజనల్ వ్యాధులపై ఆరా తీశారు. కాలనీలో డెంగీ పాజిటివ్ కేసు వచ్చిన ఇంటిని సందర్శించారు. వ్యాధి వ్యాప్తిపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. దోమల వ్యాప్తి ద్వారానే ప్రధానంగా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాపిస్తాయని, నీటి పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది సైతం వ్యాధుల నియంత్రణ చర్యల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమాత్రం అలసత్వం ప్రదర్శించినా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాస్‌జీ, ఏఎంవో కుమారస్వామి, మునిసిపల్ హెల్త్ అసిస్టెంట్ శివకుమార్, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



రాంనగర్‌కాలనీలో సీజనల్ వ్యాధుల వివరాలు తెలుసుకుంటున్న అసిస్టెంట్ డైరెక్టర్ జేవీ విజయ్‌కుమార్

ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు ఉండొద్దు

కొత్తకోట : సీజనల్ వ్యాధుల కాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండొద్దని రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్ కుమార్ సూచించారు. గురువారం పట్టణంలోని 6వ వార్డులో డెంగీ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో దోమల సంతతి పెరుగుతుందని, వాటిని నివారించడనికి మునిసిపల్, పంచాయతీ అధికారులు వీధుల్లో ఫాగింగ్ చేయాలని సూచించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ముందు పాత టైర్లు, నీటి తొట్లు, కొబ్బరి చిప్పలు, డ్రముల్లో నీరు నిల్వ ఉండకుండా చూచుకోవాలని సూచించారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెంట ఏఎంవో స్వామి, సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎల్‌వో రాజు, తిరపతయ్య, హెల్త్ అసిస్టెంట్ మధుగౌడ్ తదితరులున్నారు.

కేసరి సముద్రంలో నీటి కుక్కల సంచారం

కందనూలు, సెప్టెంబరు 5 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రంలో నీటి కుక్కలు గురువారం సాయంత్రం ప్రత్యక్షమయ్యాయి. వీటి ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో జిల్లా కేంద్రంలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షానికి చేపలను తింటూ కేసరి సముద్రంలో తిరుగుతూ గురువారం సాయంత్రం చెరువు పరిసర ప్రాంతంలో సంచరించాయి.



నాగర్‌కర్నూల్ కేసరి సముద్రం చెరువులో నీటి కుక్కలు



సారాతో పట్టుబడిన చిన్నరాములు

సారా విక్రయిస్తున్న వ్యక్తికి రూ.లక్ష జరిమానా

జడ్చర్ల, సెప్టెంబరు 5 : సారా విక్రయిస్తూ పట్టుబడిన వ్యక్తిని బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ విప్లవ్‌రెడ్డి గురువారం తెలిపారు. భూత్పూర్ మండలం పోతుగుంటతండాకు చెందిన విశ్లావత్ చిన్నరాములు సారా విక్రయిస్తూ రెండు నెలల క్రితం పట్టుబడ్డాడు. ఈయనను భూత్పూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. తిరిగి గురువారం చిన్నరాములు ఇంటి వద్ద ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, సిబ్బంది తనిఖీలు నిర్వహించగా 1.6 లీటర్ల సారా లభ్యమయ్యిందని తెలిపారు. రెండో సారి పట్టుబడడంతో రూ.లక్ష జరిమానా విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

రక్తంతో సర్వేపల్లి చిత్రం



రక్తంతో చిత్రాన్ని గీస్తున్న ఆర్ట్ టీచర్ లక్ష్మణ్

ఊట్కూర్, సెప్టెంబరు 5: మండలంలోని చిన్నపొర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రాన్ని రక్తంతో గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. మూడేళ్లుగా ఇలా చిత్రాలను గీస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు టెండర్లు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 5: మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇందుకు గురువారం టెంకాయల విక్రయం, లడ్డూ, పులిహోరా, తలనీలాలు, రంగుల రాట్నాలు తదితర వాటికి సంబంధించి జాతర మైదానంలో బహిరంగ వేలం నిర్వహించినట్లు ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. టెంకాయల విక్రయాలకు గతేడాది రూ.53.5లక్షలు పలకగా, ప్రస్తుతం రూ.3.5లక్షలు అదనంగా పలికింది. పూజా సామగ్రి విక్రయించేందుకు గతేడాది రూ.20.3లక్షలు పలకగా, రూ.37వేలు అదనంగా పలికింది. టెంకాయ చిప్పల సేకరణకు రూ.4లక్షలు పలికింది. విద్యుత్, లైటింగ్ కోసం గతేడాది రూ.8.55 లక్షలు పలుకగా, రూ.2.2లక్షలు అదనంగా పలికింది. లడ్డూ ప్రసాదం, తలనీలాల వేలం పాట వాయిదాపడ్డాయి.

ఇద్దరు బాలికలు అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 5 : ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు షీటీమ్ సభ్యుడు గూట వెంకటయ్య గురువారం తెలిపారు. తెలకపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. ప్రతి రోజు ఇంటి నుంచి పాఠశాలకు వచ్చి తిరిగి ఇంటికిపోయే వారని తెలిపారు. ఇటీవల నాలుగైదు రోజుల నుంచి ఇంటి నుంచి టిఫిన్ బాక్సు తీసుకొచ్చి పాఠశాలకు వెళ్లకుండా బయటే ఉండి, ఇంటికి వెళ్లే వారని విచారణలో తేలింది. బుధవారం ఇంటి నుంచి వచ్చిన వారు పాఠశాలకు వెళ్లకుండా సాయంత్రం ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు షీటీంకు ఫిర్యాదు చేశారు. షీటీం నిర్వాహకులు పాఠశాలలో విచారించగా నాలుగైదు రోజుల నుంచి పాఠశాలకు సక్రమంగా రావడం లేదని తెలిపినట్లు ఆయన చెప్పారు. ఇద్దరు బాలికలు అన్నదమ్ముల పిల్లలు. ఒకరు 9వ తరగతి, మరొకరు పదో తరగతి చదువుతున్నారు. ఘటనపై సీసీ ఫుటేజ్ పరిశీలిస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య తెలిపారు.

గోపాల్‌పేటలో వివాహిత..

గోపాల్‌పేట : కూలీ పనులకు వెళ్లి వివాహిత అదృశ్యమైన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో చోటు చేసుకుంది. ఎస్సై హరిప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్‌పేటకు చెందిన జయన్న, భార్య జానకి దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. భార్యాభర్తలు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే వారు. గత నెల 26వ తేదీన జానకి కూలీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మిడ్జిల్‌లో యువతి..

మిడ్జిల్ : మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి గత నెల 28వ తేదీ నుంచి కనిపించడం లేదని తండ్రి వెంకటయ్య గురువారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

రివ్యూల పేరుతో నగదు స్వాహా

జడ్చర్ల, సెప్టెంబరు 5 : లింకులు పంపించి రివ్యూలకు సమాధానం ఇవ్వాలని పేర్కొంటూ నగదు స్వాహ చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో చోటు చేసుకుంది. సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపాలిటీలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి సిమ్రిన్‌కు ఓ వ్యక్తి సామాజిక మాధ్యమంలో ఆగస్టు 15న ఒక లింకు పంపించాడు. దాని ద్వారా గ్రూపులో జాయిన్ కావాలని పేర్కొంటూ, వచ్చిన పోస్టులకు రివ్యూలు ఇవ్వాలని సూచించాడు. రివ్యూలతో పాటు కొన్ని టాస్క్‌లు పూర్తి చేస్తే డబ్బులు వస్తాయంటూ ఆశ చూపాడు. టాస్క్‌లో భాగంగా ఆగస్టు 16న ఒక యుపీఐ ఐడీ పంపించి అందులో రూ.1.20లక్షలు జమ చేయాలని కోరాడు. అధిక డబ్బులు వస్తాయన్న ఆశతో తన బ్యాంకు ఖాతాలో నుంచి బాధితురాలు జమ చేసింది. ఆ డబ్బులను విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో మోసపోయానని భావించి సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసిందని తెలిపారు. గురువారం బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వివరించారు.

మహిళల భద్రత కోసమే షీ టీమ్స్



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైం, సెప్టెంబరు 5: మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ పని చేస్తున్నాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం షీ టీమ్స్, సైబర్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు, అక్రమ రవాణా, ర్యాగింగ్ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రత కోసం రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతీ జిల్లా పరిధిలో షీ టీమ్స్ ఏర్పాటు చేసి ఆకతాయిలు ఆట కట్టిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా వేధింపులకు పాల్పడితే డయల్ 100, 6303923211 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. రోజు రోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే తక్షణమే 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో సైబర్ సెక్యూరిటీ ఇన్‌చార్జి డీఎస్పీ రత్నం, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునందిని, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఏపీపీ సునీత, సీఐ నాగభూషణం, ఎస్ఐలు జలంధర్ రెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భరోసా సెంటర్‌తో బాలికలకు రక్షణ



ఖిల్లాఘణపురం కేజీబీవీ పాఠశాలలో భరోసా సెంటర్‌పై అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 5: భరోసా సెంటర్ బాలికలకు రక్షణగా నిలుస్తోందని సెంటర్ నిర్వాహక సభ్యురాలు నాగలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీ తెలుగు మీడియం పాఠశాలలో విద్యార్థినులకు గురువారం బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టు విధంగా వాటి యొక్క ఉద్దేశాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భరోసా సెంటర్ నిర్వహణ సభ్యురాలు నాగలక్ష్మి మాట్లాడుతూ... చిన్నారులపై అత్యాచారం, లైంగిక వేధింపులకు గురైన బాలికలను ఒకే గొడుగు కిందకు చేర్చి భరోసా సెంటర్ న్యాయ సేవలందిస్తుందని తెలిపారు. మానసిక ధైర్యం, సంపూర్ణ ఆరోగ్యం, న్యాయ సలహాలు, ఆర్థిక చేయూత, జీవన నైపుణ్య శిక్షణ తరగతులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తు పూర్తిస్థాయిలో బాధిత బాలికలకు రక్షణగా భరోసా సెంటర్ ఉంటుందని తెలిపారు. బాధిత బాలికల వివరాలను గోప్యంగా ఉంచి నేరస్తులకు శిక్షపడే విధంగా చర్యలు తీసుకునే బాధ్యత భరోసా సెంటర్‌ది అని తెలిపారు. అనంతరం హోంగార్డు కృష్ణసాగర్ కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల విద్యార్థులకు సంభవించే అనర్థాలు, డయల్ 100 తో పోలీస్ భద్రత, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్ఓ ప్రశాంతి, భరోసా సెంటర్ నిర్వాహక సభ్యులు కీర్తి ఉపాధ్యాయురాలు పుష్పలత, స్వరూప, క్యాతాని, శారద, కవిత, సుగుణ, శివమణి, పీఈటీ విజయలక్ష్మి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలతో రోడ్డు ప్రమాదాలు

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 5: మండల కేంద్రం, గ్రామాల్లో చికెన్ వ్యర్థాలు, గ్రామానికి, రోడ్డుకు దూరంగా వేయాలని అధికారులు చికెన్ సెంటర్ నిర్వాహకులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో చికెన్ సెంటర్‌లలోని వ్యర్థాలను రోడ్డు పక్కన వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఫిర్యాదు చేయడంతో గురువారం ఇన్‌చార్జి ఎస్ఐ నరేష్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రవితేజరెడ్డి డంపింగ్‌యార్డు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. డంపింగ్ యార్డు ప్రాంతంలో చికెన్ సెంటర్ నిర్వాహకులకు చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన వేయడంతో జరిగే ప్రమాదాలపై పంచాయతీ కార్యదర్శి రవితేజ రెడ్డి అవగాహన కల్పించారు. గ్రామాల్లో జనావాసాలకు దూరంగా చికెన్ వ్యర్థాలను పారవేయాలని సూచించారు. డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై వ్యర్థాలను వేయడంతో కుక్కల సంచారం ఎక్కువైందని, రోడ్డుపై వెళ్లే వాహనదారులపై కుక్కలు దాడి చేస్తున్నాయని తెలిపారు. డంపింగ్ యార్డు వద్ద దుర్వాసన వెదజల్లుతోందని సమీపంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డును జనావాసాలకు ప్రధాన రహదారికి దూరంగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. డంపింగ్ యార్డు ముందున్న ప్రధాన రహదారిపై గతంలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఆసుపత్రి పాలైన సంఘటనలు ఉన్నాయి. కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏటిపాలైన రంగసముద్రం చేపలు

- ఆదుకోవాలని చిన్నారెడ్డికి మత్స్యకారుల వినతి



మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

శ్రీరంగాపురం, సెప్టెంబరు 5: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వలన వరద ఉధృతిని దృష్టిలో ఉంచుకొని అధికారులు రంగ సముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ గేట్లు ఎత్తారు. రిజర్వాయర్‌లోని చేపలు బయలకు వెళ్లాయి. దీంతో తాము తీవ్రంగా నష్టపోయామని మత్స్యకారులు గురువారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డిని కలిశారు. తాము ఏళ్లతరబడి పెంచిన చేపలు బయటకు వెళ్లడంతో తీవ్రంగా నష్టపోయామని ప్రభుత్వం తరపున తమను ఆదుకోవాలని కోరుతూ శ్రీరంగాపూర్ మత్స్యకారులు చిన్నారెడ్డికి వినతి పత్రం అందించారు. వెంటనే స్పందించిన చిన్నారెడ్డి మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మత్స్యకారులను ఆదుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య, ఉపాధ్యక్షుడు విష్ణు, కాంగ్రెస్ నాయకులు రాగివేణు, అంజి, విష్ణు, రామకృష్ణ, అంజి, బీసన్న, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

వీపనగండ్ల, సెప్టెంబరు 5: భారీ వర్షాల వల్ల నష్టపోయిన బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని బొల్లారం, కొర్లకుంట గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆయన పరిశీలించారు. భారీ వర్షాల వల్ల వరి పైరు కొట్టుకుపోయాయని. నీరు నిలిచి పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఎకరా వరి సాగుకు రూ. 35వేలు ఖర్చు వస్తుందని, ప్రభుత్వం నష్టపరి హారం కింద ఇస్తామన్న పదివేలు సరిపోవని రూ. 25వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వరి, వేరుశనగ, ఆముదం, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ మండల కమిటీ సభ్యుడు గురుమయ్య, గ్రామ కార్యదర్శి సిల్మారెడ్డి, మహిళా సమైఖ్య నాయకులు సుజాత, నాయకులు వినోద్, యాదగిరి, గోవిందు, శివ తదితరులు పాల్గొన్నారు.

రంగ సముద్రం ఊటను పరిశీలించిన భీమా అధికారులు

శ్రీరంగాపురం, సెప్టెంబరు 5: భీమా ప్రాజెక్టు అంతర్భాగమైన రంగసముద్రం బ్యాలెన్స్ రిజర్వాయర్‌కు ఇటీవల వరదలు రావడంతో రిజర్వాయర్ జలకళను సంతరించుకున్నది. రిజర్వాయర్ వెనుక భాగంలో ఉన్న ఇళ్లలో ఊట వస్తోందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. భీమా అధికారులు గురువారం ఊట వచ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా భీమా ఈఈ కేశవరావు మాట్లాడుతూ ఊట వస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని తెలిపారు. రిజర్వాయర్‌ను పరిశీలించిన వారిలో డీఈ కిరణ్ కుమార్, ఏఈ దేవరాజ్ గ్రామస్థులు శ్రీహరిరాజు, బాలచంద్రయ్య, సలీం పాల్గొన్నారు.

స్నేహాన్ని చాటుకున్న బాల్య మిత్రులు

పెద్దమందడి, సెప్టెంబరు 5: తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు మృతి చెందడంతో తోటి స్నేహితులు వారి స్నేహాన్ని చాటుకున్నారు. పెద్దమందడి మండలం వెల్లూరు గ్రామానికి చెందిన కానపురం గోపి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఆకస్మిక మృతి చెందాడు. గురువారం తోటి స్నేహితులు చలించి గోపి కుటుంబానికి రూ. 50వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అన్ని విధాలుగా స్నేహితుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నక్కల సుజాత, ఇర్కిచెట్టి సుజాత, ఎం వేణుయాదవ్, కన్నె నరసింహ, ఏ. తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షుడిగా జంపన్న

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5: భవన నిర్మాణ కార్మిక సంఘం వనపర్తి పట్టణ అధ్యక్షుడిగా మునిసిపల్ కౌన్సిలర్ జంపన్న యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జిల్లా కేంద్రంలోని భవన నిర్మాణ సంఘ భవనంలో సమావేశమైన కార్మికులు నూతన అధ్యక్షుడిగా జంపన్న యాదవ్, ప్రధాన కార్యదర్శిగా మోడల దినేష్ సాగర్, సహాయ కార్యదర్శులుగా మన్నెం, ఏర్పుల రాములు, పోతులపల్లి రాజు, శ్రీను, శివ, సుబ్రమణ్యం, ముఖ్య సలహాదారులు చిలుక బాలస్వామి సాగర్‌లను ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మునిసిపల్ చైర్మన్ పుట్టపాలక మహేష్, పాకనాటి కృష్ణ తోటి కౌన్సిలర్లు మునిసిపల్ కార్యాలయంలో జంపన్న యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, నక్క రాములు, విభూది నారాయణ, భాషానాయక్, చీర్ల సత్యంసాగర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, సమన్వయకర్త లక్కాకుల సతీష్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సూరి, నాయకులు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కొందరికి మోదం ఖేదం

- 25 అంశాలతో రూపొందించిన మునిసిపల్ ఎజెండా
- తప్పుల తడక అంశాలంటూ బీఆర్ఎస్ కౌన్సిలర్ల విమర్శ
- ఎజెండా అంశాలను వ్యతిరేకిస్తూ వాకౌట్
- కమిషనర్‌ను సీడీఎంఏకు సరెండర్ చేసిన కౌన్సిల్ సభ్యులు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5: వనపర్తి మునిసిపల్ సాధారణ సమావేశం కొందరికి మోదం.. మరి కొందరికి ఖేదంగా మారింది. గురువారం వనపర్తి మునిసిపల్ సాధారణ సమావేశం చైర్మన్ పుట్టపాకల మహేష్ అధ్యక్షతన మునిసిపల్ కార్యాలయంలో జరిగింది. 25 అంశాలతో రూపొందించిన ఎజెండాను అకౌంట్ అధికారి కృష్ణయ్య చదివి వినిపించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిల్ సభ్యులు ఎజెండా పూర్తిగా తప్పుగా తయారు చేశారని మండిపడ్డారు. కార్యాలయంలో కుర్చీలు కొనుగోలు చేయడానికి ఏకంగా రూ.8 లక్షలు మూత్రశాలల మరమ్మతుకు రూ. 5 లక్షలు, బ్లీచింగ్ పౌడర్, సున్నం కొనుగోలు, వాటర్ సెక్షన్‌లో మైనర్ రిపేర్‌లు చేయడానికి లక్షలు వెచ్చించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే ఒక్క కాంట్రాక్టర్ పేరుపై లక్షల రూపాయల అవినీతికి పాల్పడ్డారంటూ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశం ప్రారంభమైన కొద్ది సేపటికే బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ తదితరులు వాకౌట్ చేశారు.

మెజారిటీ సభ్యులతో ఆమోదం..

మునిసిపాలిటీలో ప్రతీ నెల జరగాల్సిన సాధారణ సమావేశంలో భాగంగా ఆగస్టు నెలకు సంబంధించిన సమావేశం గత నెల 31న నిర్వహించాల్సి ఉండగా వర్షాలు, శ్రావణ శనివారం అంటు మెజారిటీ సభ్యులు సమావేశానికి హాజరు కాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేసిన కమిషనర్ పూర్ణచందర్ అదే సమావేశాన్ని తిరిగి గురువారం నిర్వహించారు. ఈ సమావేశం నిర్వహణలో భాగంగా పలు ప్రజా సమస్యలతో రూపొందించిన 25 ఎజెండా అంశాలను బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు తిరస్కరించి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్‌తో కలిపి 21 మంది కౌన్సిల్ సభ్యులు ఎజెండా అంశాలను ఆమోదించారు.

కమిషనర్ సరెండర్..

వనపర్తి మునిసిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణచందర్ సకాలంలో కార్యాలయంలో ప్రజలకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉండటం లేదని, కౌన్సిల్ సభ్యులు ఎప్పుడు ఫోన్ చేసినా అందుబాటులోకి రావడం లేదని, ప్రతినిత్యం కలెక్టరేట్ చుట్టు ప్రదక్షిణ చేస్తున్నాడని అధికార పార్టీ కౌన్సిలర్లు అసహనం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ కలుగజేసుకుని ఇలాంటి కమిషనర్‌తో పరిపాలన సాగించలేమని తెగేసి చెబుతూ వెంటనే సీడీఎంఏకు సరెండర్ చేద్దామని తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో మెజారిటీ కౌన్సిల్ సభ్యులు కమిషనర్ పూర్ణచందర్‌ను సరెండర్ చేస్తున్నట్లు సీడీఎంఏకు, అదనపు లోకల్ బాడీ కలెక్టర్‌కు సంతకాలు చేసి పంపించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్లు బాపనిపల్లి వెంకటేష్, బ్రహ్మచారి, సత్యంసాగర్, విభూది నారాయణ, నక్క రాములు, జంపన్న యాదవ్, ఏర్పుల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి బయట పడుతుందనే వాకౌట్

- మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పురచైర్మన్ మహేష్

వనపర్తి టౌన్, సెప్టెంబరు 5: నాలుగేళ్ల బీఆర్ఎస్ పాలనలో మునిసిపాలిటీని లూటీ చేశారని, మీ అవినీతి ఎక్కడ బయటపడుతుందోననే భయంతోనే కౌన్సిల్ సమావేశాన్ని వాకౌట్ చేసి వెళ్లిపోయారని మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ బీఆర్ఎస్ కౌన్సిలర్లపై ధ్వజమెత్తారు. గురువారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చైర్మన్, వైస్ చైర్మన్ హోదాలో ఉన్న గత బీఆర్ఎస్ సభ్యులు మునిసిపాలిటీని పూర్తిగా భ్రష్టుపట్టించారని, నేడు ఏమి ఎరుగని సుద్దపూసల్లా అవినీతి గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. నాలుగేళ్లపాటు పరిపాలన సాగించిన బీఆర్ఎస్ నాయకుల పుణ్యమా అని కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేవని, కార్యాలయానికి ఎవరైన వస్తే కూర్చోవడానికి కుర్చీలు కూడా లేకుండా చేశారని ఆరోపించారు. మునిసిపల్ కార్యాలయానికి పైపై మెరుగులు దిద్దడానికి, డోర్ కాటన్స్, కుర్చీల కోసం అప్పట్లో రూ. 60 లక్షలు లూటీ చేసిన ఘనులు మీరే అని అన్నారు. ఆనాటి మీ అవినీతిని ఒక్కొక్కటిగా చక్కదిద్దుకుంటూ పాలన సాగిస్తున్నామని, గురివింద నీతులు మాని ప్రజల కోసం పని చేయాలన్నారు. వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఏమాత్రం పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు కనీసం కౌన్సిల్ సమావేశంలోనైనా చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని అందరం ఆశించామని తెలిపారు. కానీ ప్రజల సమస్యలు అంటే బీఆర్ఎస్ కౌన్సిలర్లకు ఏమాత్రం పట్టడం లేదనేది తేటతెల్లం అయిందన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు వెంకటేష్, సత్యంసాగర్, నారాయణ, నక్క రాములు, భాషానాయక్ తదితరులు పాల్గొన్నారు.

తేరుకోని పంటలు



అమరచింత శివారులో వరద నీటి నుంచి తేరుకోని వరి పంట

అమరచింత, సెప్టెంబరు 5: విస్తారంగా కురిసిన వర్షాలకు చెరువులు, కుంటల సమీపంలో మునిగిన పంట పొలాలు ఇంకా వరద నీటి నుంచి తేరుకోలేదు. అమరచింతతో పాటు పలు గ్రామాల్లో వరి, చెరకు, పత్తి తదితర పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. అమరచింత పెద్ద చెరువు అలుగు పారడంతో ఆయకట్టు కింద ఉన్న వరి, చెరకు తదితర పంటలు నీట మునిగాయి. వర్షాలు కొద్దిగా తగ్గినా పంట పొలాలు మాత్రం వరద నీరు నుంచి బయట పడలేదు. దీంతో రైతులకు అపార నష్టం వాటిల్లింది. వర్షానికి మట్టి ఇళ్లు కూలుతుండడంతో పాటు మునిగిన పంటలు తేరుకోకపోవడంతో బాధితులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

కొత్తకోటలో..

కొత్తకోట : మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటిలో మునిగిన పంటలను వ్యవసాయ అధికాఱులు గురువారం పరిశీలించారు. కొత్తకోట, వడ్డెవాట, చర్లపల్లి, రాయనిపేట, పామాపురం గ్రామాల్లో 90 ఎకరాల మేర వరి పంట నీట మునిగినట్లు నివేదిక తయారు చేశారు. రాయనిపేట రాజా సముద్రంలో మునిగిన పంటలను రైతుల సమక్షంలో వ్యవసాయ విస్తర్ణ అధికారి రవీందర్ రెడ్డి పరిశీలించారు. విస్తర్ణ అధికారి వెంట రైతులు సంపత్ కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వసంతరెడ్డి, చెన్నయ్య, గోవిందు, బాలరాజు తదితరులు ఉన్నారు.



మదనాపురం : వంతెన వద్ద ధ్వంసమైన రహదారి



కొత్తకోట : నీటిలో మునిగిన నంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

మదనాపురంలో..

మదనాపురం : మండలంలోని ఊకచెట్టు వాగుపై ఉన్న ఆత్మకూర్, కొత్తకోట ప్రధాన రహదారి వరకు ధ్వంసంమైంది. గురువారం వరద తగ్గడంతో అధికారులు రహదారిని పరిశీలించారు. సుమారు 30 పీట్ల మేర రోడ్డు వరద నీటికి కొట్టుకుపోయింది. దీంతో గురువారం సాయంత్రం ఎక్స్‌కవేటర్ సాయం తో మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి వీలుంటుంది. రహదారిపై కాంక్రీట్ వేస్తేనే అన్ని రకాల వాహనాలు వెళ్లే వీలుంటుందని స్థానికులు వాపోతున్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



తిర్మలాయపల్లెలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

మదనాపురం, సెప్టెంబరు 5: మండలంలోని అన్ని పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని తిర్మలాయపల్లె పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య విద్యార్థులకు సర్వేపల్లి జీవిత చరిత్ర గురించి తెలియజేశారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారని తెలిపారు.

కొత్తకోటలో..

కొత్తకోట : మండలంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదాభివందనం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కనిమెట్ట గ్రామ ప్రాథమిక పాఠశాలలో దివంగత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కనిమెట్టలో పరమేష్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత : ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం అమరచింత మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని పాఠశాలలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వంగా ఉందని అన్నారు. అనంతరం గురువులను విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు కృష్ణవేణి, వెంకటన్న, రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, మోహన్, అగ్రిప్ప, రాములు, ఆయాషా, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఆత్మకూరు మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు విశ్వేశ్వర్ మాట్లాడుతూ... సర్వేపల్లి రాధాకృష్ణ భారతదేశంలో అత్యున్నత పురస్కారమైన భారతరత్న అవార్డును 1963లోనే పొందారని తెలిపారు. విద్య పట్ల అత్యంత ఆసక్తి కనబరిచిన మహనీయుడని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు జమ్మన్న, రాఘవేంద్రరావు, సునీల్ కుమార్, శ్వేత, కురుమూర్తి, లలితమ్మ, వీణ, చైతన్య, రాణి, బాలకృష్ణ, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘణపురంలో..

ఖిల్లాఘణపురం :మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లోని విద్యార్థుల ఉపాధ్యాయులకు పుష్పగుచ్ఛాలు అందించి సన్మానించారు. ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్ఫూర్తిగా తీసుకుని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని పలువురు అభిప్రాయపడ్డారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ



అమరచింతలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

వనపర్తి అర్బన్, సెప్టెంబరు 5: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పట్టణంలో ప్రతీ బూత్ నుంచి 200కి పైగా సభ్యత్వాలు నమోదు చేయించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణానికి సంబంధించిన సభ్యత్వాలు కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ బూత్ నుంచి సభ్యత్వాలు ఎక్కువ సంఖ్యలో చేయిస్తే మునిసిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు సునాయాసంగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్, సీనియర్ నాయకులు సీతారాములు, చిత్తారి ప్రభాకర్, పట్టణ అధ్యక్షులు బచ్చు రాము, మహిళా నాయకురాలు సుమిత్రమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

అమరచింతలో..

అమరచింత : బీజేపీ నగర శాఖ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీజేపీ జెండా కట్ట వద్ద జరిగిన కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో పార్టీలో చేరిన కార్యకర్తలు, నాయకులకు సభ్యత్వ నమోదు ప్రారంభించామని అన్నారు. భారతదేశ ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై చాలా మంది బూత్ స్థాయి నుంచి మండల స్థాయి వరకు అనేక మంది పార్టీలో చేరుతున్నారని అన్నారు. సమష్టి కృషితో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుందామని అన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మేర్వ రాజు, నరాల నారాయణ, వెంకటేశ్వర్లు, మరాఠి అశోక్, సిద్ద రాములు, వాటర్ శ్రీను, రాకేష్ శెట్టి, అర్జున్, మేర్వ అనిల్, రామలింగం, నరాల సిద్ధు ఉన్నారు.

విద్యుత్ శాఖ ఏఈకి సన్మానం

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 5: ఉమ్మడి పెబ్బేరు మండలానికి విద్యుత్ శాఖ ఏఈ ఉద్యోగ బాధ్యతలు తీసుకున్న కిరణ్‌కుమార్‌ను గురువారం బ్లాక్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ కలిసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, మాజీ సర్పంచు సురేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు బురమోని రాములుయాదవ్, మాజీ డైరెక్టర్ రాములు, నరసింహ నాయుడు, తాటికొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరులో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

పెబ్బేరు రూరల్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను స్వీకరించిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఉత్తమ అవార్డు గ్రహీతలైన ఉపాధ్యాయులు అరుంధతి, దుర్గాప్రసాద్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో తోమాలపల్లి కృపాకర్‌రెడ్డి, సహదేవుడు, ఈశ్వర్‌రెడ్డి, నరేందర్, రాజు నాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు సంత స్థలాన్ని కాపాడాలి

- జిల్లా అఖిల పక్షం నాయకులు

పెబ్బేరురూరల్, సెప్టెంబరు 5: పెబ్బేరు సంత స్థలాన్ని కాపాడుకునేందుకు రాజకీయాలకు అతీతంగా పోరాడుదామని అఖిల పక్షం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం అఖిల పక్షం సంఘం నాయకుడు సతీస్‌యాదవ్ మునిసిపల్ కమిషనరుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనంలో పురుగులు'

కొత్తకోట, సెప్టెంబరు 5 : విద్యార్థులకు ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనంలో పురుగులు వచ్చిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండల అమడబాకుల గ్రామ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ఎప్పటిలాగే విద్యార్థులు గురువారం మధ్యాహ్న భోజనం తింటుండగా పురుగులు కనబడ్డాయి. అన్నంలో పురుగులు ఉన్నాయని విద్యార్థులు ఒకరికొకరు చెప్పుకొని భోజనం తినడం మానేశారు. విషయం తెలుసుకున్న గ్రామ యువకులు పాఠశాలకు చేరుకొని భోజనాన్ని, బియ్యాన్ని పరిశీలించారు. అన్నంలో పురుగులు కనిపించడంతో ఇదేమిటని ఉపాధ్యాయులను నిలదీశారు. మధ్యాహ్న భోజన చార్జీ తమది కాదని హాజరైన ఇద్దరు ఉపాధ్యాయులు తెలిపారు. హెచ్ఎం ఇతర ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలకు వెళ్లారని తెలిపారు. విద్యార్థులకు భోజనం నాణ్యతగా వడ్డించాలని మరోసారి ఇలాగే ఉంటే ఆందోళన చేస్తామని యువకులు హెచ్చరించారు.

వడ్డెర సంఘం మండల కమిటీ ఎంపిక

ఖిల్లాఘణపురం, సెప్టెంబరు 5: మండల కేంద్రంలోని వడ్డెర సంఘం కమ్యూనిటీ భవనంలో గురువారం వడ్డెర సంఘం మండల కమిటీని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసర్ల భూమయ్య ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా సంపంగి లోకయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లెపు ఆంజనేయులు, గౌరవ అధ్యక్షుడిగా సంపంగి రాములు తదితరులను ఎన్నుకున్నారు.